క్లుప్తంగా

పోస్టాఫీస్‌లో సొమ్ము గోల్ మాల్

పొన్నూరు: తపాలా కార్యాలయంలో ప్రజలు దాచుకున్న సొమ్మును స్వాహా చేసిన ఘటన శనివారం పొన్నూరు మండలంలోని ఆరెమండ పోస్టాఫీస్‌లో చోటుచేసుకుంది. బాపట్ల డివిజన్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు.. సాధారణ తనిఖీల్లో భాగంగా పోస్టాఫీస్‌లో అవకతవలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ తన పరిధిలోని ప్రజల నుంచి సేకరించిన నగదును పాస్ పుస్తకాల్లో జమ చేయలేదన్నారు. విచారణ కొనసాగుతుందని, ప్రజల డబ్బులను పోస్టాఫీసులో జమ చేయకుండా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

కళ్లం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకుడు ఎం.శ్రీను నాయక్‌కు డాక్టరేట్ పొందినట్లు కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో అధ్యాపకుడి అభినందన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఎం.శ్రీనునాయక్‌కు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఇంపాక్ట్ ఆఫ్ ఈ వాలెట్ యూసేజ్ డ్యూరింగ్ పోస్ట్ కోవిడ్ పాండమిక్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఆర్.నారాయణగుప్తా, డాక్టర్ ఆర్.మహేష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ పీఎల్ మాధవరావు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ప్రత్తిపాడు: నిబంధనలకు విరుద్ధంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం హైవే సమీపంలో కాటూరి ఆస్పత్రి వెనుక వైపు ఉన్న ప్లాట్‌లలోని ఓ భవనంలో రేషన్ బియ్యాన్ని పెద్ద ఎత్తున నిల్వ చేశారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేశారు. అందులో సుమారు 130 తెల్ల బస్తాల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారమందించడంతో సీఎస్ డీటీ పద్మజ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు బస్తాలను లెక్కించి ప్రత్యేక వాహనంలో ప్రత్తిపాడులోని పౌరసరఫరాల గిడ్డంగికి తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం సుమారు 60 నుంచి 70 క్వింటాళ్లు ఉండవచ్చని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు పెరటి, మిద్దె తోటల పెంపకంపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిద్దెతోటలు, పెరటి తోటల పెంపకంపై ఉచిత అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. వివరాలకు 97053 83666 సంప్రదించాలని సూచించారు.

విద్యతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలి



గుంటూరు రూరల్: విద్యార్థినులు విద్యతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలని సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శనివారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థినులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. అనంతరం వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిస్ ఫ్రెషర్‌గా వి.అమూల్య, షేక్ నఫీజా ఎంపికయ్యారు. కార్యక్రమంలో భాగంగా మిస్ ఫ్రెషర్‌లకు కిరీటాలను అందజేశారు.

వేధిస్తున్న భర్తపై కేసు

లక్ష్మీపురం: భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. గుండారావుపేటకు చెందిన వి.రాణికి వీరయ్యతో పదేళ్ల కిందట వివాహం అయింది. భర్త వేధింపులు పడలేక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సలాం కేసు నమోదు చేశారు.

పసినోటికి.. పప్పులేని బువ్వ

అవ్వ! బువ్వలో పప్పులేదా!

- అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన కందిపప్పు సరఫరా
- ఈనెల గర్భిణులు, బాలింతలకూ మొండిచేయి
- అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం



ప్రత్తిపాడులోని మార్కెట్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్రైడ్ రైస్ తింటున్న చిన్నారులు

ప్రత్తిపాడు: ప్రభుత్వ నిర్లక్ష్యం చిన్నారులకు శాపంగా మారింది. కూటమి సర్కారు అంగన్‌వాడీ చిన్నారులపై నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి కందిపప్పును సరఫరా చేయకుండా చోద్యం చూస్తోంది. దీంతో చిన్నారులకు పోషకాహారం దూరమైంది. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు మధ్యాహ్న భోజనానికి (3–6 చిన్నారులకు) ప్రభుత్వం కందిపప్పును సరఫరా చేస్తుంది. కానీ జూలై నెల నుంచి కూటమి ప్రభుత్వం కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిపివేసింది. దీంతో నాలుగు వేల మంది చిన్నారుల నోటి కాడ పప్పు లేని కూడును పెడుతున్నారు అంగన్‌వాడీలు.

పసివారు అడగలేరని కాబోలు..

నోరు తెరిచి చిన్నారులు అడగలేరనో.. లేక చిన్నారులదేముందిలే అనుకున్నారో ఏమో గానీ వారికి మాత్రమే కందిపప్పు సరఫరాను నిలిపివేశారు. కాగా ఇదే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఇచ్చే టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్)కు మాత్రం కందిపప్పును గత నెల వరకూ సరఫరా చేశారు. దీంతో కొంత మంది అంగన్‌వాడీలు తల్లులను బతిమాలుకుని ఒక ప్యాకెట్ కందిపప్పు తీసుకుని చిన్నారులకు మధ్యాహ్న భోజనంలో పప్పు, సాంబారులను వండిపెడుతున్నారు. కాగా మరికొంత మంది మాత్రం ఏదో ఒక ఆకుకూర చేసి మమ అనిపిస్తున్నారు. ఇంకొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అయితే ఏకంగా ఉప్పు, కారాలతోనే ఏదో ఒక రైస్ (ఎగ్ రైస్, ఫ్రైడ్ రైస్) వంటివి చేసి చిన్నారుల బొజ్జ నింపుతున్నారు.

కాగా సెప్టెంబరులో గర్భిణులు, బాలింతలకు కూడా కూటమి సర్కారు మొండి చేయి చూపించింది. వారికి ఇంటికి ఇచ్చే కందిపప్పును నేటి వరకూ సరఫరా చేయలేదు. ఒక పక్కన పోషణ మాసోత్సవాలు జరుగుతున్న సమయంలోనే ఇలా ప్రధానమైన పోషకాహారం కందిపప్పు లేకపోవడం అధికారులకు తలనొప్పిగా పరిణమించింది. దీంతో నియోజకవర్గంలో 1600 మందికి పైగా గర్భిణులు, బాలింతలు పోషకాహారానికి దూరమవ్వాల్సిన పరిస్థితి.

ఇదీ ప్రాజెక్టు లెక్క..

అంగన్‌వాడీ కేంద్రాలు:	226
గర్భవతులు:	948
బాలింతలు:	744
0- 6 నెలల చిన్నారులు:	763
6 నెలలు-1 సంవత్సరం చిన్నారులు:	963
1-3 చిన్నారులు:	4023
3-6 చిన్నారులు:	4,547

జూన్ వరకూ కందిపప్పు ఇచ్చాం



మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టే మధ్యాహ్న భోజనానికి జూన్ వరకూ కందిపప్పు ఇచ్చాం. తల్లులకు ఈ నెల మాత్రమే ఇవ్వలేదు. త్వరలోనే కందిపప్పును సరఫరా చేస్తాం. అప్పటి వరకు చిన్నారులకు ఇబ్బందులు లేకుండా ఏదో ఒక ఆకుకూరతో కూర చేసి పెట్టమని ఆదేశాలిచ్చాం.

– వి.సుజాతదేవి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేశారు. వ్యాపారవేత్త బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున మొత్తం రూ.72 వేలు ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, మేనేజర్ మురళీధర్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.వి.బి.వెంకటరావు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఓలేటి హేమ సుందరమ్మ పాల్గొన్నారు.

బృందగానం పోటీలు

నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బృందగానం పోటీలు -2024 జరిగాయి. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ గుంటూరు కల్నల్ ఎస్‌ఎం చంద్రశేఖర్, శ్రీత్యాగరాజ సంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు.

విద్యార్థుల్లో మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



హై జంప్ చేస్తున్న బాలిక



వెనిగండ్లలో చెస్‌లో పోటీపడుతున్న విద్యార్థులు



ప్రత్తిపాడులో చెస్‌లో గెలుపొందిన విద్యార్థులు

ప్రత్తిపాడు: స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి, మండల స్థాయి క్రీడా ఎంపికల్లో భాగంగా శనివారం చెస్, హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు విడివిడిగా జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. ఆయా పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు. కాగా శనివారం రన్నింగ్ పోటీ వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. ఈ పోటీలను సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.డేవిడ్ రాజ్‌కుమార్ తెలిపారు.

పెదకాకాని: విద్యార్థుల్లో మానసికోల్లాసం పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు శంకరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల శ్రీ వేమన జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి ఆటల పోటీలు రెండోరోజు జరిగాయి. ఈ పోటీలలో భాగంగా శనివారం అండర్- 17, అండర్- 14 బాల బాలికల విభాగాల్లో కబడ్డీ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్యామల వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాంబశివరావు పర్యవేక్షించారు. అండర్- 17 కబడ్డీ బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్, వెనిగండ్ల విన్నర్, పెదకాకాని జెడ్పీహెచ్ స్కూల్ రన్నర్, బాలికల విభాగంలో వెనిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ స్కూల్ కొప్పురావూరు ద్వితీయస్థానంలో నిలిచారు. కబడ్డీ అండర్- 14 బాలుర విభాగంలో నంబూరు జేఎంజే స్కూల్ విన్నర్, వెనిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్ రన్నర్, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జేఎంజే స్కూల్, నంబూరు రన్నర్ సాధించారు. చెస్ అండర్- 17 బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జేఎంజే స్కూల్ నంబూరు రన్నర్, బాలికల విభాగంలో జేఎంజే స్కూల్, నంబూరు విన్నర్, జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల రన్నర్‌గా నిలిచాయి. అండర్- 14 చెస్ బాలుర విభాగంలో జేఎంజే స్కూల్ నంబూరు విన్నర్, జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల రన్నర్, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జేఎంజే స్కూల్ నంబూరు రన్నర్‌గా నిలిచాయి. అలానే షటిల్ బ్యాడ్మింటన్ అండర్- 17 బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ నంబూరు విన్నర్, జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల రన్నర్, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ వెనిగండ్ల విన్నర్, జేఎంజే స్కూల్ నంబూరు రన్నర్‌గా నిలిచాయి. అండర్- 14 షటిల్ బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ నంబూరు విన్నర్, జేఎంజే నంబూరు రన్నర్, బాలికల విభాగంలో జేఎంజే స్కూల్ విద్యార్థులు విన్నర్, వెనిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు రన్నర్లుగా నిలిచినట్లు పీఈటీ మస్తాన్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో వ్యాయామోపాధ్యాయులు మరియన్న, లక్ష్మీపతి, అశోక్, భూపాల్‌రెడ్డి, చంటిబాబు, విద్యాకమిటీ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ ఆటలపోటీలు చివరి రోజు అథ్లెటిక్స్ సోమవారం నంబూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు క్రీడల కన్వీనర్ తెలిపారు.



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



సైబర్ సెక్యూరిటీ వివిధ చట్టాలను గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: సైబర్ క్రైం, మాదకద్రవ్యాల వినియోగం, రవాణా లాంటి నేరాల ద్వారా ఒక్కసారి కేసు నమోదైతే వారి జీవితం నాశనం అవుతుందని గుంటూరు సైబర్ సెక్యూరిటీ సెల్ ప్రతినిధి కిషోర్ తెలిపారు. మండలంలోని చల్లావారిపాలెం గ్రామంలోని విక్టోరియా ఫార్మసీ కళాశాలలో స్టెప్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, డ్రగ్ అబ్యూస్, ఈవ్‌టీజింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఉమెన్ ట్రాఫికింగ్‌లపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతపై, విద్యార్థులకు ఇటువంటి కేసులు నమోదైతే వారు ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను ఎంపికకాలేరని దాని వల్ల భవిష్యత్ అంధకారమవుతుందని హెచ్చరించారు. లీగల్ కౌన్సిలర్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కె.పద్మ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్ లాంటి అనైతిక చర్యలకు పాల్పడటం వల్ల సమాజంలో గౌరవం కోల్పోతారని, చట్టపరంగా శిక్షలను అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. చట్టంలోని వివిధ సెక్షన్లను వివరించారు. ఆత్మరక్షణకు ఏవిధమైన మెలుకువలు పాటించాలి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.వినయ్ పాల్గొన్నారు.

మన నిర్లక్ష్యాన్ని పైవాళ్లు గమనిస్తున్నారు

మండల గణాంకాధికారి వెంకట్రామయ్య



మాట్లాడుతున్న మండల గణాంకాధికారి వెంకట్రామయ్య

ప్రత్తిపాడు: విధుల్లో మన నిర్లక్ష్యాన్ని పైవాళ్లు గమనిస్తున్నారని మండల గణాంకాధికారి వెంకట్రామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర 2047, ఐదేళ్లలో పదిహేను శాతం గ్రోత్ సాధించడానికి ఏం చేయాలన్న అంశాలపై చర్చించేందుకు మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి 20 శాఖల అధికారులు రావాల్సిందిగా సూచించినప్పటికీ, కేవలం ఏడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు.

ఇప్పుడిప్పుడంటే ఎలా..?

సమావేశంలో ఏఎస్‌ఓ వెంకట్రామయ్య మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలో పదిహేను శాతం గ్రోత్ సాధించాలంటే రానున్న ఐదేళ్లలో ఏమేమి చేయాలో ఇప్పుడే, ఇక్కడే చెప్పాలని కోరారు. దీంతో కొందరు అధికారులు ఇప్పుడిప్పుడు ఐదేళ్ల ప్లాన్.. అంటే ఎలాగని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు కావాలని మరో అధికారి కోరారు. స్పందించిన ఏఎస్‌వో మీరిచ్చే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి పంపిస్తామని, ఇందులో ఎవ్వరి పేర్లు రాయమని, అందుచేత ఇక్కడికిక్కడే సలహాలివ్వాలని సూచించారు. దీంతో అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో వారికి తెలిసిన కొన్ని అంశాలను వివరించి వెళ్లిపోయారు.

రోగులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టం



గుంటూరు మెడికల్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, రోగులకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో అదృష్టమని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు, ఆలా హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన వైద్య విద్యార్థులను ఆయన అభినందించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, స్టెతస్కోప్‌ను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి వచ్చేవారు సేవాభావం కలిగి ఉండాలని, నిరంతరం విద్యార్థి మాదిరిగా ఉండి, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామానికి చెందిన ముగ్గురు ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటాలో పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లు పొందిన ఒకే గ్రామానికి చెందిన వేమవరపు మృదులత, పల్లా త్రివేణి, బిందెల వెంకటగౌతమిలను డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు.

ప్రమాదంలో గేదె మృతి

ప్రత్తిపాడు: గేదెకు పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలేనికి చెందిన ఇదుపులపాటి వాసు పశుపోషణ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న మూడు గేదెలను ఎప్పటిలానే శుక్రవారం సాయంత్రం కూడా మేపుకుని తిరిగి గేదెలను తీసుకుని ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో సర్వీసు రోడ్డులోని బ్రిడ్జి దగ్గర అతివేగంగా వెళుతున్న లారీ గేదెలను ఢీకొట్టింది. దీంతో ఒక గేదె అక్కడిక్కడే మృతి చెందగా, మరో గేదెకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు వాసు ఇచ్చిన పిర్యాదు మేరకు శనివారం ఎస్‌ఐ నాగేంద్ర కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గొట్టిపాడు పశువైద్యశాల వైద్యాధికారి నంద కిషోర్ పోలీసుల సూచన మేరకు గేదెకు హైవే సమీపంలో పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను పోలీసులకు అందించనున్నట్లు తెలిపారు.

ఇంటింటి ఓటరు సర్వే పరిశీలించవచ్చు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొని పరిశీలించవచ్చని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని, వారు సర్వేని పరిశీలించవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాలపై ఏవిధమైన అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బీఎల్‌ఓలు అక్టోబర్ 18 వరకు ప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన కొత్తగా నమోదు కావలసిన ఓటరులను నమోదు చేయాలని కోరారు. పాత డోర్ నంబర్లు ఉన్న ఓటర్లకు కొత్త డోర్ నంబర్లు మార్చడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎల్.పద్మ, డి.జాన్ బాబు (వైఎస్సార్‌సీపీ), నాయుడు ఓంకార్ (టీడీపీ), పాండురంగ విఠల్ (బీజేపీ), బి.సునీల్ కుమార్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), సీహెచ్.వాసు (బీఎస్పీ), ఎస్.కె.ఖాసిం(సీపీఎం), టి.సేవ కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ) పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కార లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక రైలుపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పి.సమత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

గుంటూరు నగరంలో వాయు కాలుష్య, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపునకు నగరపాలక సంస్థతో పాటుగా వివిధ శాఖల సమన్వయంతో సంయుక్త కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ అధ్యక్షతన ట్రాఫిక్ పోలీస్, డీటీసీ, విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ శాఖలతో సమావేశం నిర్వహించారు.

గర్భిణులు మెరుగైన పోషకాహారం తీసుకోవాలి



గొట్టిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళల బరువును పరిశీలిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: గర్భిణులు సరైన పోషకాహారాన్ని తీసుకోవాలని, లేదంటే పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో పోషకాహార లోపంతో పుట్టే అవకాశం ఉందని గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా శనివారం పెదగొట్టిపాడు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతల బరువును పరిశీలించారు. వెయ్యి రోజుల సంరక్షణ, పోషకాహార ఆవశ్యకత, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారం.. వంటి విషయాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త టి.వెంకటరమణ, ఆశాకార్యకర్తలు కస్తూరి, మహిళలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులాలో గురజాడకు ఘన నివాళి



గుంటూరు రూరల్: సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ప్రతి ఒక్కరికి మార్గదర్శకుడని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో శనివారం సంఘ సంస్కర్త గురజాడ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. ప్రముఖ సామాజిక వేత్త డి.రమాదేవి మాట్లాడుతూ మహిళా భద్రత, సామాజిక మధ్యమాలలో మహిళలపై జరుగుతున్న అనుచిత ప్రచారాలు, మహిళా సాధికారికత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ హెచ్.భవాని పాల్గొన్నారు.